నమస్తే తెలంగాణ
కరీంనగర్
10 | కరీంనగర్, శనివారం 5 ఏప్రిల్ 2025 | KARIMNAGAR

పల్లెల్లో ముంచుకొస్తున్న తాగునీటి ముప్పు?

- పంచాయతీల్లో నీటి ఎద్దడి నివారణకు పైసా కేటాయించని సర్కారు
- పద్నాలుగు నెలలుగా నిలిచిపోయిన గ్రాంటులు
- కనీసం బోర్ల మరమ్మతులు చేయించేందుకు చిల్లిగవ్వ కరువు
- ఇప్పటికే అప్పులు తెచ్చి పెడుతున్న కార్యదర్శులు
- భవిష్యత్ భారం భరించలేమంటూ ఆందోళన
- చేస్తారా.. చస్తారా..? అంటూ ఉన్నతాధికారుల బెదిరింపులు
- భయం గుప్పిట్లో పంచాయతీ సెక్రటరీలు

పల్లెల్లో నీటి ఎద్దడి ముంచుకొస్తున్నది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని పలు పంచాయతీల్లో తాగునీటి తండ్లాట మొదలైంది. ఇది మే నాటికి తీవ్రరూపం దాల్చే ముప్పు కనిపిస్తున్నది. ఓవైపు అడుగుంటిన భూగర్భజలాలు.. మరోవైపు ప్రాజెక్టుల్లో తగ్గిన నీటిమట్టాలు వెరసి తాగునీటి వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో పరిస్థితులను అధ్యయనం చేసి, చక్కదిద్దడంతో పాటు వేసవి ముందస్తు ప్లాన్ కింద నీటి ఎద్దడి నివారణకు నిధులు విడుదల చేయాల్సిన సర్కారు.. నయాపైసా ఇవ్వకుండా చోద్యం చూస్తున్నది. పద్నాలుగు నెలలుగా గ్రాంటులు నిలిచిపోగా, కనీసం బోర్లు మరమ్మతులు చేయించలేని పరిస్థితి ఏర్పడుతున్నది. ఇవేవీ పట్టన్నట్టు వ్యవహరిస్తున్న అధికారులు.. పనిచేస్తారా.. లేదా..? అంటూ ఒత్తిడి చేస్తుండడంతో కార్యదర్శులు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారు. ఇప్పటికే తెచ్చిన అప్పులు చెల్లించలేకపోతున్నామని, భవిష్యత్ భారం ఎలా మోస్తామని ఆందోళన చెందుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఉన్న పంచాయతీలు.. వార్డుల వివరాలు..

జిల్లా	పంచాయతీలు	వార్డులు
జగిత్యాల	383	3,500
పెద్దపల్లి	263	2,474
కరీంనగర్	313	2,966
రాజన్న సిరిసిల్ల	255	2,240

కరీంనగర్, జనవరి 4 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పల్లెలకు తాగునీటి ముప్పు పొంచి ఉన్నది. ఉమ్మడి జిల్లాలో 1214 పంచాయతీలుండగా, ఇప్పటికే పలు పంచాయతీల్లో తండ్లాట మొదలైంది. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక సోర్సులను ఏర్పాటు చేసి మిషన్ భగీరథ ద్వారా పుష్కలమైన నీటిని అందించింది. కానీ, ప్రస్తుత పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. ప్రధానంగా ఎక్కడికక్కడ భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. పల్లెలకు తాగునీరందించే బోర్లు వట్టిపోతున్నాయి. డిమాండ్ మేరకు సరఫరా చేయలేకపోతున్నాయి. అలాగే మంచినీటి సోర్సుల్లోనూ నీళ్లు సరిపడా లేక మోటర్ల ద్వారా నీరివ్వలేని పరిస్థితులు నెలకొన్నాయి. కొన్నేళ్లుగా ఉమ్మడి జిల్లాలోని ప్రతి ప్రాజెక్టు, చెరువులు మండుటెండల్లోనూ నిండుకుండలుగా ఉండడంతో భూగర్భజలాలు పెరిగి.. తాగునీటికి తిప్పలు తిప్పాయి. ప్రస్తుతం చెరువులు ఎడారిని తలపిస్తున్నాయి. ప్రాజెక్టుల్లోనూ నీళ్లు కనీస నీటిమట్టానికి పడిపోయాయి. కాళేశ్వరం నుంచి నీటిని ఎత్తిపోసేందుకు ప్రభుత్వం ఆసక్తి చూపడం లేదు. అంతేకాదు, ప్రాజెక్టుల నుంచి వరికి మరో తడి ఇస్తే తప్ప పంట చేతికి వచ్చేలా లేదు. ప్రస్తుతం ప్రారంభమైన నీటి కొరత వేసవి నాటికి తీవ్ర రూపం దాల్చే ప్రమాదం కనిపిస్తున్నది.

నిలిచిన గ్రాంటులు

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామ పంచాయతీలకు వివిధ రకాల గ్రాంటులు వచ్చేవి. 2011 జనాభా ప్రాతిపదికన ప్రతినెలా చిన్న చిన్న పంచాయతీలకు నెలకు ₹50వేలు, మధ్యరకం జీపీలకు సుమారు ₹5లక్షల నుంచి ₹10 లక్షలు, మేజర్ పంచాయతీలకు ₹15లక్షల నుంచి ₹25లక్షల వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు వచ్చేవి. ఇంకా నెలానెలా పల్లెప్రగతి కింద నిధులు జమయ్యేవి. రాష్ట్ర ప్రభుత్వం కూడా పల్లె ప్రగతికి ప్రత్యేక గ్రాంటు మంజూరు చేయడంతో పంచాయతీలు కళకళలాడాయి. ఈ నిధులు ఉండడం వల్ల ప్రతి పంచాయతీ నీటి ఎద్దడి నివారణకు ప్రణాళికలు తయారు చేసుకొని ముందుకెళ్లేవి. కానీ, ప్రస్తుతం పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. 2019 జనవరి 21, 25, 30 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ ఎన్నికలు వివిధ దశల్లో జరగ్గా.. 2024 ఫిబ్రవరి ఒకటితో పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసింది. దీంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారుల పాలనను అమల్లోకి వచ్చింది. నిబంధనల ప్రకారం సర్పంచ్ పదవీకాలం ముగిసిన ఆరునెలల్లోగా ఎన్నికలు జరగాలి. కానీ, ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న పరిస్థితిని చూస్తే ఎప్పుడు జరుగుతాయో తెలియదు. ఎన్నికలు లేకపోవడం వల్ల కేంద్రం ఇచ్చే ఆర్థిక సంఘం గ్రాంటును ఆపేసింది. ఇదే సమయంలో స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి కూడా నిధులు రావడం లేదు. దీంతో పంచాయతీల్లో ఖజనా ఖాళీగా దర్శనమిస్తున్నది. అంతేకాదు, స్థానికంగా వసూలు చేసే ఇంటిపన్ను తదితర ఆదాయానికి సంబంధించిన నిధులు డ్రా కావడం లేదు. గతేడాది జూన్ నుంచి అందుకు సంబంధించిన చెక్కులు పాస్‌కావడం లేదు. దాదాపు పద్నాలుగు నెలలుగా నిలిచిపోవడంతో ప్రతి పంచాయతీలోనూ రోజువారీ నిర్వహణే కష్టసాధ్యంగా మారింది.

గంభీరావుపేటలో తాగునీటి సమస్య పరిష్కరించాలని రోడ్డుపై ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న చేస్తున్న మహిళలు

బెదిరింపులు.. లేదంటే చార్జీ మెమోలు?

పంచాయతీల్లో పైసా లేక రోజువారీ నిర్వహణ కష్టమవుతున్నదనే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారం అయ్యేలా చూడాలంటూ పంచాయతీ కార్యదర్శులు నిత్యం ఉన్నతాధికారులకు మొర పెట్టుకుంటున్నా పట్టించుకునే వారు లేరు. పైగా వాస్తవ పరిస్థితులను ఏమాత్రం పరిగణలోకి తీసుకోకుండా రోజువారీ నిర్వహణతోపాటు పంచాయతీల్లో తాగునీరు, పారిశుద్ధ్య సమస్య వంటివి లేకుండా చూడాలంటూ ఉన్నతాధికారులు హుకూం జారీచేస్తున్నారు. పంచాయతీ పనులకు అప్పులు తెచ్చి పెడుతున్నామంటూ చెప్పినా వినకుండా.. 'చేస్తే చేయండి. లేకుంటే మీ చావు మీరు చావండి' అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని పలువురు కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు కొంత మంది కార్యదర్శులకు చార్జీ మెమోలు జారీచేయడంతోపాటు సస్పెండ్ చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో భవిష్యత్ భారం మోయలేక.. చిల్లిగవ్వలేని పంచాయతీలను ముందుకు నడుపలేక.. అప్పులు తెచ్చిపెట్టి ముందుకు తీసుకెళ్లే సామర్థ్యం లేక కార్యదర్శులు సతమతమవుతున్నారు.

ఏవీ ప్రణాళికలు?

నిజానికి పంచాయతీలకు తాగునీటి ఎద్దడి పొంచి ఉందని, ఇప్పటికే పలుచోట్ల ఆ పరిస్థితులు తలెత్తుతున్నాయని క్షేత్రస్థాయి నివేదికలు చెబుతున్నాయి. ఈ పరిస్థితుల్లో వాస్తవ విషయాలపై సమీక్షా సమావేశం నిర్వహించి, నీటిఎద్దడి నివారణకు తీసుకోవాల్సిన చర్యలు.. అవసరమైన నిధులకు సంబంధించిన అంచనాలు తయారు చేయాల్సిన ప్రభుత్వం ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నదన్న విమర్శలు వస్తున్నాయి. ఎక్కడైనా నీటి ఎద్దడి ఏర్పడితే.. తాత్కాలికంగా ట్యాంకర్ల ద్వారా తెప్పించడానికి చిల్లగవ్వలేని పరిస్థితి పంచాయతీల్లో ఉన్నది. కనీసం బోరు చెడిపోయినా రిపేర్ చేయించలేని దుస్థితి ఉన్నది. నిజానికి మెజార్టీ పల్లెల్లో బోర్లు పనిచేయడం లేదు. వాటిని రిపేర్ చేయాలంటే కార్యదర్శులే జేబుల నుంచి డబ్బులు పెట్టుకోవాల్సిన పరిస్థితి ఉన్నది. డబ్బులు పెట్టినా బిల్లులు ఎప్పుడొస్తాయో తెలియదు. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో వాస్తవాలను తెలుసుకునేందుకు యుద్ధ ప్రాతిపదికన ఇన్‌చార్జి మంత్రి ఆధ్వర్యంలో ప్రభుత్వం జిల్లాలవారీగా సమావేశాలు ఏర్పాటు చేసి, పంచాయతీల్లో నీటి ఎద్దడి నివారణకు అవసరమయ్యే నిధులను ప్రత్యేక ఫండ్ నుంచి కేటాయించాలన్న డిమాండ్ వస్తున్నది. అందుకోసం యుద్ధప్రాతిపదిక ప్రణాళికలు చేస్తే తప్ప ప్రయోజనం ఉండదన్న వాదనలను పంచాయతీ సెక్రటరీలు చెబుతున్నారు.

రోజువారీ అవసరాలకు నిధులు ఇవ్వాలి

పంచాయతీల్లో రోజువారీ అవసరాలకు సంబంధించి ప్రభుత్వం నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ప్రస్తుతం రోజువారీ ఖర్చులకు జేబు నుంచి పెట్టుకునే పరిస్థితి ఉన్నది. వసూలు చేసిన ఇంటిపన్ను లాంటి ఆదాయాలకు సంబంధించిన జనరేట్ చేసిన చెక్కులు ట్రెజరీల్లో పాస్ కావడం లేదు. జూన్ నుంచి చెక్కులు పాస్ కాకపోవడం వల్ల కార్యదర్శులం అనేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వాన్ని ఒక్కటే వేడుకుంటున్నాం. తక్షణం మా సమస్యలను గుర్తించి రోజు వారీ నిర్వహణకు నిధులు విడుదల చేయాలని కోరుతున్నాం. 2019 ఏప్రిల్ 12 నుంచి జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సర్వీస్ కాలాన్ని కలుపాలని ముఖ్యమంత్రిని విజ్ఞప్తి చేస్తున్నాం.

- జీ అజయ్‌కుమార్, కరీంనగర్ జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు

సిరిసిల్లలోని అంబేద్కర్ చౌరస్తాలో మానవ హారంగా ఏర్పడి నిరసన తెలుపుతున్న నేతన్నలు

వెనక్కి తగ్గని నేతన్న

- కూలీ రేట్ల కోసం నిరసన
- నాలుగో రోజుకు నిరవధిక సమ్మె

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వం ఇస్తున్న చీరెల తయారీకి కూలీ రేట్లు నిర్ణయించాలని డిమాండ్ చేస్తూ నేతన్నలు ఉద్యమిస్తూనే ఉన్నారు. అరెస్టులతో భయపెట్టినా.. సమ్మెను విచ్ఛిన్నం చేసే ప్రయత్నం చేసినా వెనక్కి తగ్గకుండా పోరు మరింత ఉధృతం చేస్తున్నారు. శుక్రవారం నిరవధిక సమ్మె నాలుగో రోజుకు చేరుకోగా, సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తాలో మానవ హారంగా ఏర్పడి నిరసన తెలిపారు. బీవైనగర్‌లోని కార్మిక భవన్ నుంచి ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా సీఐటీయూ తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు మూషం రమేశ్, కోడం రమణ మాట్లాడుతూ, నేతన్నల విషయంలో చేనేత జౌళీశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మహిళా సంఘాల కోసం ప్రభుత్వం తయారు చేస్తున్న చీరెలు కార్మికుల ఉపాధి కోసం కాకుండా, యజమానుల జేబులు నింపేందుకేనని మండిపడ్డారు. యజమానులకు వస్త్ర ఉత్పత్తి ధర నిర్ణయించి, కార్మికుడికి నిర్ణయించక పోవడం ఏంటని ప్రశ్నించారు. నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు కానీ, యజమానులకు ఏదైనా జరిగితే వెంటనే స్పందిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలిస్టర్ కూలీ తగ్గించి శ్రమ దోపిడీకి పాల్పడుతున్న యజమానులపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదన్నారు. అసలు జౌళీశాఖ అధికారులున్నారా.. లేదా..? అన్నది కూడా అనుమానంగా ఉందన్నారు. పోలీసులను పెట్టి తమ ఉద్యమాలను అణిచి వేయాలని చూస్తే మరింత పోరాడుతామని హెచ్చరించారు. త్వరలో అన్ని పార్టీలను కలుపుకుని ఉద్యమిస్తామన్నారు. నిరసనలో నాయకులు ఎల్లారెడ్డి, అన్నల్‌దాస్ గణేశ్, సిరిమల్ల సత్యం, నక్కదేవదాస్, ఎలిగేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

గోదావరిఖనిలోని జవహర్‌నగర్‌లో శుక్రవారం కూడా మూసి ఉన్న రేషన్ దుకాణాలు

సన్నబియ్యం పంపిణీ ఇంకెప్పుడు?

రామగుండం బల్దియాలో మూసి ఉన్న రేషన్ దుకాణాలు

కోల్‌సిటీ, ఏప్రిల్ 4 : పెద్దపల్లి జిల్లా రామగుండం నగర పాలక సంస్థ పరిధిలోని రేషన్ షాపుల్లో సన్న బియ్యం ఇంకా ఎక్కడా పంపిణీ చేయడం లేదు. ఈ ఉగాది నుంచే రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తామని ప్రభుత్వం చెప్పిన నేపథ్యంలో పండుగ రోజున గోదావరిఖనిలో ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ తహసీల్దార్ సమక్షంలో లాంఛనంగా ప్రారంభించారు. అయితే, మరుసటి రోజు నుంచి నగరంలో ఎక్కడ చూసినా రేషన్ దుకాణాలు మూసే ఉన్నాయి. ఈ విషయమై తహసీల్దార్ కుమారస్వామిని సంప్రదించగా, తమకు వచ్చిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 4 నుంచి సన్నబియ్యం పంపిణీ ప్రారంభిస్తామని చెప్పారు. అయితే, శుక్రవారం కూడా గోదావరిఖనిలోని పలు డివిజన్లలో రేషన్ దుకాణాలు మూసే ఉన్నాయి. ఉదయం కార్డులు చేతపట్టుకొని దుకాణాలకు వచ్చిన లబ్ధిదారులు సాయంత్రం నుంచి పోస్తారని భావించి వెనుదిరిగి వెళ్లిపోయారు. తీరా సాయంత్రం కూడా రేషన్ దుకాణాలు మూసే ఉండడంతో ఈ పండుగకు సన్నబియ్యం దేవుడెరుగు? పేదవాళ్లను పస్తులు ఉంచుతారా? అని పలువురు లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

నర్సయ్య కుటుంబానికి కేటీఆర్ భరోసా

ఎక్స్‌లో సానుభూతి

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 4 : ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మలిదశ ఉద్యమ కాలంలో యాక్టివ్‌గా పని చేసిన గడ్డి నర్సయ్య గురువారం మృతి చెందగా సమాచారం తెలుసుకున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ ద్వారా శుక్రవారం సానుభూతి ప్రకటించారు. నర్సయ్య కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నర్సయ్య మృతి పార్టీకి తీరని లోటు అని, అతని కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నామని పేర్కొన్నారు.

సంతాపాన్ని తెలుపుతూ ఎక్స్‌లో కేటీఆర్ చేసిన పోస్ట్

సిబిల్ స్కోర్ ఉంటేనే యువవికాసం లోన్!

గంగాధర, ఏప్రిల్ 4: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడానికి రాజీవ్ యువవికాస పథకంలో కాంగ్రెస్ సర్కారు రోజుకో నిబంధన పెడుతున్నది. దరఖాస్తు దారులను ఇబ్బందులకు గురి చేస్తున్నది. నిన్నటి వరకు ఇన్‌కం సర్టిఫికెట్ ఉంటేనే దరఖాస్తు చేసుకోవచ్చనే నిబంధనతో యువకులు మీ సేవా కేంద్రాల చుట్టూ తిరిగారు. తహసీల్ ఆఫీసుల్లో వందలాదిగా దరఖాస్తులు పేరుకుపోయి ఇబ్బంది పడ్డారు. మూడు రోజుల క్రితం ప్రభుత్వం ఇన్‌కం సర్టిఫికెట్ నిబంధన ఎత్తివేయడంతో ఊరట చెందారు. కానీ, అంతలోనే బ్యాంకర్లు మరో కొత్త మెలిక పెట్టారని దరఖాస్తుదారులు వాపోతున్నారు. సిబిల్ స్కోర్ 700 దాటితేనే లోన్ వస్తుందని చెబుతుండడంతో ఇదేక్కడి నిబంధన అంటూ పెదవి విరుస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ రుణానికి, సిబిల్ స్కోర్‌కు ఏం సంబంధమని ప్రశ్నిస్తున్నారు.

ప్రొటోకాల్ పాటించలేదని..

రేషన్ డీలర్ తొలగింపు

గంగాధర, ఏప్రిల్ 4: ప్రొటోకాల్ పాటించలేదని రేషన్ డీలర్‌ను తాత్కాలికంగా తొలగించిన ఘటన గంగాధర మండలంలోని ముప్పిడినర్సయ్యపల్లిలో జరిగింది. ఈ నెల 2న మండలంలోని రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీని అధికారికంగా ప్రారంభించడానికి అధికారులు ఏర్పాటు చేశారు. ఆ తర్వాతే గ్రామాల్లో బియ్యం పంపిణీ చేయాలని రేషన్ డీలర్లకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అయితే, వారి ఆదేశాలను పాటించకుండా మండలంలోని ముప్పిడినర్సయ్యపల్లి రేషన్ డీలర్ రామచంద్రం ముందే బియ్యం పంపిణీ చేశాడు. దీంతో ఆగ్రహించిన స్థానిక నాయకులు విషయాన్ని అధికారులు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ప్రొటోకాల్ పాటించకుండా బియ్యం పంపిణీ చేసిన రేషన్ డీలర్‌ను తాత్కాలికంగా తొలగించి నర్సింహులపల్లి రేషన్ డీలర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినట్లు తహసీల్దార్ అనుమప తెలిపారు.

గల్ఫ్ నుంచి గోల్డ్ స్మగ్లింగ్?

- స్వదేశానికి వచ్చే గల్ఫ్ కార్మికులే టార్గెట్!
- కస్టమ్స్ అధికారులను దాటి జిల్లాలకు
- రాజన్న సిరిసిల్ల జిల్లాలో కలకలం
- రెండు కేసులు నమోదుతో అనేక ప్రశ్నలు

విదేశీ బంగారం వ్యవహారం సిరిసిల్ల జిల్లాలో కలకలం రేపుతున్నది. గల్ఫ్ నుంచి తీసుకొచ్చిన దాదాపు రెండు కోట్ల విలువైన రెండు కిలోల బంగారంతో ఓ వ్యక్తి ఉడాయించాడనే ప్రచారం జోరుగా సాగుతున్నది. దీనిపై వేములవాడలో కేసు నమోదైనట్టు తెలియడం చర్చనీయాంశమవుతున్నది. అయితే స్వదేశానికి వచ్చే గల్ఫ్ కార్మికులే టార్గెట్‌గా గోల్డ్ స్మగ్లింగ్ జరుగుతున్నదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బంగారం తీసుకువచ్చే విషయంలో అత్యాశకు పోయి అమాయకులు బలవుతున్నట్టు తెలుస్తుండగా, దేశాలు దాటి కిలోల కొద్దీ బంగారం ఎలా బయటకు వస్తున్నదనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

వేములవాడ, ఏప్రిల్ 4: సౌదీలో ఉంటున్న చందుర్తి మండలం జోగాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు గత నెల ఇండియాకు వచ్చేందుకు సిద్ధమయ్యారు. ఈ సయంలో ఆ ఇద్దరికి జగిత్యాల జిల్లా మెట్‌పల్లి ప్రాంతంలోని మల్లాపూర్‌కు చెందిన ఓ వ్యక్తికి రెండు కిలోల బంగారాన్ని ఇవ్వాలని అక్కడి స్మగ్లర్లు చెప్పారు. అయితే అంత పెద్దమొత్తం బంగారం తాము తీసుకెళ్లమని జోగాపూర్‌వాసులు ముందుగా చెప్పినట్టు తెలిసింది. స్వదేశం చేరేవరకు మీ వెంట మా వ్యక్తి వస్తాడని, విమానాశ్రయంలో అంతా అతనే చూసుకుంటాడని స్మగ్లర్లు ఒప్పించినట్టు తెలిసింది. హైదరాబాద్ విమానాశ్రయంలో దిగిన వెంటనే బంగారం సదరు వ్యక్తులకు అప్పగిస్తే లక్షన్నర నగదు, 10 గ్రాముల బంగారంతోపాటు ఫ్లైట్ టికెట్ చార్జీలు కూడా ఇచ్చేందుకు ఒప్పందం కుదిరినట్టు సమాచారం. అయితే, మూడు గంటల ప్రయాణంలో దాదాపు ₹2.50 లక్షలు వస్తుండడంతో ఆ ఇద్దరు గల్ఫ్ కార్మికులు ఆసక్తి చూపినట్టు తెలిసింది. అయితే, వెంటనే బంగారం తీసువస్తున్న విషయాలన్నింటినీ అందులోని ఒకరు తమ సమీప బంధువుకు సమాచారాన్ని ఇచ్చినట్టు తెలిసింది. దీంతో సదరు సమీప బంధువు బంగారం ఎవరికీ ఇవ్వాల్సిన పనిలేదని, తాను అమ్మి పెడతానని రప్పించి, వారిని హైదరాబాద్‌లోని ఒక హోటల్‌లో దింపినట్టు సమాచారం. అయితే, బంగారం బయట అమ్మేందుకు వెళ్లిన ఆ వ్యక్తి ఎంతకూ తిరిగి రాలేదు. దీంతో సదరు బంగారం ఇండియాకు పంపిన స్మగ్లర్ల ముఠా రంగంలోకి దిగి, చందుర్తి మండలంలోని జోగాపూర్‌కు చేరుకొని ఆరా తీసింది. చివరకు మల్లాపూర్‌కు చెందిన వ్యక్తితో వేములవాడ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయించగా, దాదాపు ₹రెండు కోట్ల విలువైన బంగారంతో ఉడాయించిన వ్యక్తి కోసం పోలీసులు గాలిస్తున్నట్టు తెలిసింది.

జిల్లాలో రెండు కేసులు

విదేశాల నుంచి బంగారం తీసుకువచ్చిన వ్యవహారంలో సిరిసిల్ల జిల్లాలో రెండు పోలీస్ కేసులు నమోదైన విషయం తెలిసిందే. నాలుగు నెలల క్రితం చందుర్తి మండలంలోని సనుగుల గ్రామానికి చెందిన ఒకరు గల్ఫ్ దేశం నుంచి స్వదేశానికి వచ్చారు. తంగళ్లపల్లి మండలంలోని ఒకరు ఆయన ద్వారా బంగారాన్ని పంపినట్టు తెలిసింది. అయితే మరుసటి రోజు బంధువులు గల్ఫ్ నుంచి వచ్చిన వ్యక్తి ఇంటికెళ్లి బంగారం గురించి అడగగా కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారని, తన వద్ద బంగారం లేదని తేల్చి చెప్పినట్టు తెలిసింది. దీంతో సదరు బాధితుడి బంధువులు పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదైంది. తాజాగా జోగాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు సౌదీ నుంచి వచ్చిన వ్యవహారంలోనూ ఇదే బంగారం వ్యవహారంలో కేసు నమోదైంది. అయితే విదేశీ బంగారం విషయంలో అమాయకులు అత్యాశకు పోయి బలవుతున్నట్టు తెలుస్తున్నది. అసలు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు కిలోల కొద్ది బంగారం స్మగ్లింగ్ రూపంలో వస్తున్నట్టు ఆరోపణలున్నాయి. అయితే అంతర్జాతీయ విమానాశ్రయంలో తనిఖీలు క్షుణ్ణంగా జరుగుతున్నా.. కిలోల కొద్దీ బంగారం ఎలా బయటకు వస్తున్నది? అనే ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి. ఇప్పుడు దాదాపు రెండు కోట్ల రూపాయల విలువైన బంగారం ఎలా వచ్చిందనేది అంతుచిక్కడం లేదు. ఈ వ్యవహారంలో అనేక అనుమానాలు కలుగుతుండగా, పోలీసులు లోతుగా విచారిస్తే బంగారం స్మగ్లింగ్ చేస్తున్న ముఠాలు, వారి వెనుక ఉన్న కథానాయకులు ఎవరనేది తేలుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కొత్తపల్లి ఎరుకల కుంట కాలువ నుంచి ఈసాలతక్కళ్లపల్లి పెద్దచెరువుకు వెళ్లే కాల్వలో పూడిక తొలగింపు

సాగునీటికి తిప్పలు

పాలకుర్తి, ఏప్రిల్4: పాలకుర్తి మండలం ఈసాలతక్కళ్లపల్లి పెద్దచెరువు ఆయకట్టు పరిధిలో రైతులు సాగునీటి కోసం తిప్పలు పడుతున్నారు. పంట చేతికొచ్చే దశలో చెరువులో నీళ్లు లేక, ఎస్సారెస్పీ నుంచి సాగునీరు రాక ఆందోళన చెందుతున్నారు. మరో నెలరోజులు నీళ్లు వస్తేనే పంటలు చేతికి వచ్చే అవకాశముండగా కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. చెరువు చుట్టుపక్కల ఉన్న గుంతల్లో నీటిని ఇటీవల పొక్లెయిన్ పెట్టి కాలువలు తీసి మళ్లించారు. మళ్లీ ఎండల తీవ్రతకు నీరు ఆడుగంటుతుండడంతో సమీప కొత్తపల్లిలోని ఎరుకల కుంట కాలువ పూటిక మట్టి తీస్తూ, నీటిని పెద్దచెరువులోకి మళ్లిస్తున్నారు. పెద్దచెరువు కింద సుమారు 400 ఎకరాలు వరి సాగవుతుండగా, రైతులు రేయింబవళ్లు పడిగాపులు గాస్తూ వరుసతడులతో పంటలను కాపాడుకుంటున్నారు. ఎస్సారెస్పీ డీ83 ఎల్-11 ప్రధాన కాలువ ద్వారా పాలకుర్తి, కొత్తపల్లి గ్రామాల్లోని చెరువులు నింపి, వాటి నుంచి పెద్దచెరువులోకి నీటిని తరలించాలని వేడుకుంటున్నారు.